క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

బాధితులను ఆదుకుంటాం



ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసు

పాములపాడు: వర్షాల కారణంగా మట్టి మిద్దెలు కూలిన వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని ఆత్మకూరు ఆర్డీ దాసు తెలిపారు. గురువారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో పైకప్పు కూలిన మట్టి మిద్దెలను పరిశీలించారు. పాక్షికంగా కూలిన మట్టి మిద్దెల బాధితులకు ఆర్థిక సహాయం అందజేసేందుకు జిల్లా కలెక్టరుకు నివేదికలు పంపిస్తామని తెలిపారు. అలాగే గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పర్యటించారు. ప్రజలతో మాట్లాడారు. ఆయన వెంట వీఆర్వో ముర్తుజా ఉన్నారు.

రైతులకు దన్నుగా నిలవాలి

మహానంది: సహకార సంఘాలు రైతులకు ఆర్థికంగా అండగా నిలవాలని శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరులో గురువారం సొసైటీ రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఓ విజయకుమారి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, చైర్మన్ శివలింగం, సీఈఓ గోపాల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్‌కు పాముకాటు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలోని సచివాలయంలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ టి.చంద్రశేఖర్(చంద్ర) గురువారం పాముకాటుకు గురయ్యాడు. విద్యుత్‌శాఖ చేపడుతున్న జీపీఎస్ సర్వేలో భాగంగా కృష్ణనంది సమీపంలోని పొలాల్లో సర్వే చేస్తుండగా పాము కాటేసింది. తోటి సిబ్బంది వెంటనే స్పందించి చంద్రశేఖర్‌ను వైద్యసేవల నిమిత్తం స్థానిక తిమ్మాపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఎల్ఐసీని ఆదరించండి



బ్రోచర్ విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: ఎల్ఐసీ పాలసీలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ అన్నారు. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో గురువారం ఎల్ఐసీ జీవన్‌కిరణ్ పాలసీ బ్రోచర్ విడుదల చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ కొత్తపాలసీ తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్, ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ నాయకులు అబ్దుల్‌కరీం, ఎల్ఐసీ ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం రైతులకు వరం

నందికొట్కూరు: ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు రైతులకు ఓ వరమని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరి అన్నారు. గురువారం పట్టణంలోని మనగ్రోమోర్ దుకాణంలో పీఎం రైతు భరోసా 14 విడతను రైతు బ్యాంకు ఖాతాలో మోదీ జమ చేసిన కార్యక్రమాన్ని తిలకించారు. నియోజకవర్గంలో 45 పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశారు. మన గ్రోమోర్, ఇఫ్కో, నివాస్, లక్ష్మి ఫర్టిలైటర్స్ దుకాణాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో పగలు సరిగెత్తు



ఆత్మకూరు పెద్దపీర్ల వీధిలో కొలువుతీరిన హుస్సేన్ పీర్లస్వామి

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, 80బన్నూరు, మండ్లెం, తంగడంచ, జూపాడుబంగ్లా తదితర గ్రామాల్లో గురువారం పగలు సరిగెత్తు వేడుకలను నిర్వహించారు. పీర్లచావిడిల్లోని హసన్, హుసేన్ పీర్లను గ్రామా ల్లోని దర్గాల వద్దకు తీసుకెళ్లి ఫాతెహలు సమర్పించారు.

ఆత్మకూరు: పట్టణంలోని పెద్దపీర్ల వీధిలో హుస్సేన్‌పీర్లస్వామి కొలువుతీరి ఉన్నారు. గురువారం చిన్న సరిగెద్దు కావడంతో భక్తులు స్వామివారిని సందర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

కొత్తపల్లి: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని దుద్యాల, ముసలిమడుగు గ్రామాలలో పీర్ల చావిళ్లలో పీర్లు కొలువుదీరాయి. కులమతాలకు అతీతంగా ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు.

గ్రామీణుల ఆరోగ్యానికి భరోసా

- వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో వైద్య సేవలు
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటి వద్దకే వైద్యులు
- రోజుకు 60 మందిపైగానే ఫోన్ ద్వారా సేవలు
- నియోజకవర్గంలో 60 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు



జూపాడుబంగ్లా మండలంలోని మండ్లెం గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్

నందికొట్కూరు: గతంలో జబ్బు చేస్తే కూలి పని చేసుకునే గ్రామీణ ప్రాంత పేదలు పని మానుకుని పట్టణాలకు వెళ్లి ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని వెళ్లేవారు. ఏవైనా పరీక్షలు చేయించుకుంటే ఫలితాల కోసం మళ్లీ మరుసటి రోజు డబ్బు ఖర్చు పెట్టుకుని వెళ్లాల్సి వచ్చేది. దీంతో వారికి శ్రమతో పాటు డబ్బు ఖర్చు అయ్యేది. పేద ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వైద్యం కోసం పనులు మానుకుని ఆస్పత్రుల వద్దకు వెళ్లకుండా వారి గ్రామాల్లోనే వైద్య సేవలు అందేలా డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. తద్వారా గ్రామీణులకు ఉన్న ఊరిలోనే వైద్యం అందుతోంది.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్య చికిత్స వివరాలు

మండలం	వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	ఇప్పటి వరకు అందించిన వైద్య సేవలు	మండలంలో రోజుకు ఓపీలు	రోజుకు ఫోన్ ద్వారా సేవలు
నందికొట్కూరు	10	12 వేలు	300	30
కొత్తపల్లి	07	10 వేలు	140	20
మిడుతూరు	12	16 వేలు	480	40
పగిడ్యాల	09	9 వేలు	450	50
జూపాడుబంగ్లా	10	8 వేలు	240	100
పాములపాడు	12	13 వేలు	360	120
మొత్తం	60	64 వేలు	1,930	355

14 రకాల రక్త పరీక్షలు..

విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి పేద వారికి వైద్యం అందిస్తున్నారు. అంతే కాకుండా 14 రకాల రక్త పరీక్షలను అక్కడే నిర్వహించి వెంటనే ఫలితాలు తేల్చేలా అన్ని రకాల యంత్రాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఇవే కాకుండా 67 రకాల మందులను అక్కడే ఇస్తున్నారు. నియోజకవర్గంలో 60 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ప్రతి రోజు 1,930 మంది వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు. ఒక్కో విలేజ్ హెల్త్ కేంద్రంలో రోజుకు సుమారు 30 నుంచి 40 మందికి వైద్య చికిత్సలు చేస్తున్నారు. ఇప్పటికే 64 వేల మందికి వైద్య చికిత్సలు అందించారు. ప్రతి రోజు ఒక్కొక్క వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ ద్వారా 30 నుంచి 40 మందికి వైద్య చికిత్సలు చేస్తున్నారు. అంతే కాకుండా అవసరమైన వారికి టెలీ కన్సల్టెంట్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ విధానంలో రోజుకు 60 మందిపైగానే ఫోన్ ద్వారా సేవలు పొందుతున్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు గ్రామంలోనే వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా రోగులకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతున్నాయి. సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సేవలకు రుణపడి ఉంటాం. పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగనన్న.

– సుంకన్న, 10 బొల్లవరం గ్రామం, నందికొట్కూరు మండలం

పైసా ఖర్చు లేకుండా గ్రామంలోనే ఉచిత వైద్యం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచితంగా మెరుగైన వైద్య సేవలందించడం పేదల అదృష్టం. గతంలో పట్టణానికి వెళ్లి ప్రైవేట్ వైద్యం చేయించుకునేవాళ్లం. తగ్గకపోతే రెండు రోజులకు రావాలని డాక్టర్ చెప్పేవారు. మళ్లీ డాక్టర్ దగ్గరకు పోతే డబ్బులు ఖర్చు అయ్యేది. ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో ఒక పైసా ఖర్చు లేకుండా ఇంటి వద్దకు డాక్టర్లు వచ్చి వైద్యం చేస్తున్నారు.

– సుధాకర్, జీ. వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం

రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి

జూపాడుబంగ్లా: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణం దారులు తప్పనిసరిగా రైతుల పేరున బిల్లులు ఇవ్వాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. గురువారం తూడిచెర్ల గ్రామంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను ఏఓ తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించినట్లు తెలిస్తే దుకాణాలను సీజ్‌చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. గడువు ముగిసిన లైసెన్స్‌లను త్వరగా రెన్యువల్ చేయించుకోవాలని దుకాణాల యజమానులకు సూచించారు.

చర్చీలపై దాడులు పిరికిపంద చర్య

నందికొట్కూరు: మణిపూర్‌లో మహిళలపై దాడులు చేయడమే కాకుండా క్రైస్తవ చర్చీలపై దాడులు చేయడం పిరికిపంద చర్య అని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియ్యా, నాయకులు లాజరేసు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు మద్రిస్వామి అన్నారు. గురువారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ తరతరాలుగా కలిసిమెలిసి జీవిస్తున్న మైతేయి, కుకి, నాగాల మధ్య రాజకీయ లబ్ధి కోసం చిచ్చు రగిలించిన మోదీ సర్కార్, ఆ రాష్ట్రంలోని బీరెన్ సర్కార్‌ను ప్రధాన దోషులని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చూర్‌బీ, దాదమ్మ, కవిత, పద్మావతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులు మెలకువలు పాటించేలా చూడండి

కొత్తపల్లి: మండలంలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసుకుంటున్న పంటల విషయంలో మెలకువలు వివరించి, పాటించేలా ఆర్‌బీకే సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఏఓ కె.మహేష్ సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అధిక వర్షాల కారణంగా పత్తి, మొక్కజొన్న పంటలు ఎర్రగా మారే అవకాశం ఉందన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే రైతులు పొలాలో నీరు నిల్వ ఉండకుండా కాలువల ద్వారా బయటికి పంపివేసేలా చూడాలన్నారు. అధిక నీటి నిలువ వలన ఎండుతెగులు వచ్చే అవకాశం ఉన్నందున నివారణకు కార్బండిజం లీటర్ నీటికి 1గ్రా. కాపర్, ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే వర్షం తగ్గిన వెంటనే ఒక ఎకరానికి 25 కేజీల యూరియా, 20 కేజీల పొటాస్ చల్లాలని వీటితో పాటు 10 గ్రాముల పోటాషియం నైట్రేట్, 19.19.19 ను లీటర్ నీటికి 10 గ్రాముల కలిపి పంటకు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ రాజుపాల్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అదృశ్యంపై పవన్ మాట్లాడటం విడ్డూరం

- రాయలసీమ ద్రోహి చంద్రబాబే
- డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న ఉద్యోగులు

శ్రీశైలం టెంపుల్: రాష్ట్రంలో మహిళలు అదృశ్యం అయ్యారని పవన్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఏపీ డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం శ్రీశైలంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ పవన్ ఏ నివేదిక ప్రకారం మాట్లాడుతున్నాడో ప్రజలకు ఆధారాలు చూపాలన్నారు. ప్రస్తుతం మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లపై కేంద్రానికి పవన్ సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుందని హితవు పలికారు. రాష్ట్రానికి చంద్రబాబు చేసిన ద్రోహం, దోపిడీ అందరికీ తెలుసని.. అసలైన రాయలసీమ ద్రోహి చంద్రబాబేనన్నారు. ఆయన సొంత నియోజకవర్గం కుప్పం నుంచి 6, 7 సార్లు నెగ్గి అక్కడ ప్రాథమిక పాఠశాలలను బాగు చేయలేదని, ఆర్డీవో కార్యాలయాన్ని కూడా నిర్మించలేదని విమర్శించారు. ఏపీ సీఎం జగన్‌ను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ ప్రభుత్వ పరిపాలనను మెచ్చుకుని అక్కడ అధ్యయనం చేయాలని కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలకు 175స్థానాలు గెలుస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో శ్రీశైల మహాక్షేత్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నామని, ఇందులో భాగంగా సాల మండపాల నిర్మాణం, క్యూకాంప్లెక్స్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

మంత్రికి శ్రీశైలదేవస్థాన ఉద్యోగుల సత్కారం

ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఆలయ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయో పరిమితి 60 నుంచి 62 సంవత్సరాలు పెంపుదల చేసిన సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయనను గురువారం శ్రీశైల దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, ఏఈఓ హరిదాసు, మోహన్, ఈఈ రామకృష్ణ, పర్యవేక్షలు అయ్యన్న, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్లరామాపురం చెరువుకు పొంచి ఉన్న ప్రమాదం

ఆత్మకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని అన్ని చెరువులు జలకళ సంతరించుకున్నాయి. వడ్లరామాపురం చెరువుకు వర్షాల వలన గండి ముప్పు ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చెరువు పూర్తి స్థాయిలో నీటితో నిండి జలకళతో సందడి చేస్తుంది. గండి పడిన ప్రాంతాన్ని ఇరిగేషన్ అధికారులు స్పందించి మరమ్మతు చేసి పూడ్చివేయాలన్నారు. ఇప్పటికే కో ఆప్షన్ చైర్మన్ మౌలాలి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్‌లు ఇరిగేషన్ అదికారులతో చర్చించారు. సత్వరమే మరమ్మతులు చేయాలన్నారు.

నిత్యావసర సరుకులు అందించాలి

పగిడ్యాల: ప్రభుత్వ చౌక దుకాణాల్లో ప్రజలకు అవసరమైన కందిపప్పు, చింతపండు, కారం, మంచి నూనె తదితర నిత్యావసర సరుకులను తెల్లకార్డు వినియోగదారులకు నెల నెలా సరఫరా చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ కోరారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మండల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు అబ్దుల్‌రహిమాన్, రవికుమార్, హమీద్‌బాష, శాలి మియ్య, రాజు తదతరులు ఉన్నారు.

బొప్పాయి పంటల పరిశీలన

కొత్తపల్లి: గత కొద్దిరోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు దెబ్బతిన్న బొప్పాయి పంటలను ఆత్మకూరు ఉద్యానవన అధికారిణి కె.చందన గురువారం సందర్శించారు. పెద్దగుమ్మడాపురం గ్రామంలో బొప్పాయి పంటలను పరిశీలించారు. మొక్కల్లో వేరుకుళ్లు కనిపించిందని, దిని నివారణకు రిడోమిల్ 2 గ్రాములు, బ్లెటైక్స్ 3 గ్రాములు, ఎలైట్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలసి మొక్కల మొదళ్లలో పోయాలని సూచించారు. వీహెచ్ఏ శివమ్మ,ఎంపీఈఓ శ్రీనివాస్ ఉన్నారు.

కూలుతున్న మట్టిమిద్దెలు

కొత్తపల్లి: గత కొద్దిరోజులుగా కురుస్తున ఎడతెరిపిలేని వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాలలో మట్టిమిద్దెలు కూలుతున్నాయి. గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో 6, శివపురం గ్రామంలో 1 మట్టిమిద్దెలు కూలిపోయాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గతంలో ఒకరు చనిపోతేనే మరొకరికి పింఛన్
- 'జగనన్న సురక్ష' నిర్వహణలో రెండో స్థానంలో మహానంది
- ముగింపు కార్యక్రమంలో ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మసీదుపురంలో అర్హులకు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



వెలుగోడులో ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మహానంది: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎవరో ఒకరు మృతి చెందితే తప్పా మరొకరికి పింఛన్ వచ్చే పరిస్థితి ఉండేది కాదని, కానీ నేడు అందుకు భిన్నంగా అర్హులైతే చాలు ఇంటికే పథకాలు వస్తున్నాయని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మసీదుపురం గ్రామంలో సర్పంచ్ కాకనూరు లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మునగాల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పనికి యావత్ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు కీర్తిస్తుంటే పవన్ కల్యాణ్, చంద్రబాబు లాంటి వారు మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ పరమేశ్వరీ, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి,ఆత్మకూరు మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ మాళేశ్వరరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, ఆవుల వెంకటేశ్వర్లు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

రెండోస్థానంలో మహానంది:

జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణలో మహానంది మండలానికి రెండోస్థానం లభించడంతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో అందరికీ ఆదర్శంగా నిలవాలని అన్ని కార్యక్రమాలకు వందకు వంద శాతం హాజరైనట్లు చెప్పారు. మసీదుపురం సర్పంచ్ లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష ముగింపు సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు చేశారు.

అనంతరం గ్రామంలో జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

అభివృద్ధి సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

ఆత్మకూరు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం అని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. .మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చారన్నారు. మిగిలిన 1 శాతం కూడ నెరవేర్చాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డికి దుశ్శాలువా, పూలమాలలు, గజమాలతో సత్కరించారు. అనంతరం రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ ఉమాదేవి, ఎంపీపీ తిరుపాలమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్, శేషిరెడ్డి, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే

ఆత్మకూరు పట్టణంలోను, మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో జరుగుతున్న మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. వడ్లరామాపురం గ్రామంలోని మౌలాలి స్వామి మొక్కులు చెల్లించారు. పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాబు పాలనలో కరువు కాటకాలే

వెలుగోడు: చంద్రబాబు పాలనలో కరువు కాటకాలు.. దారిద్ర్యం విలయ తాండవించాయని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆత్మకూరు రహదారిలో నూతనంగా నిర్మించిన 5వ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం స్థానిక షాదీఖానాలో 5వ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సచివాలయం పరిధిలో 505 దరఖాస్తులు రాగా వాటిలో 499 పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పాను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, నాయకులు షంషీర్ అలీ, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, తెలుగు రమణ, పులి సుబ్బారెడ్డి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు మండలంలో జగనన్న సురక్ష

మహానంది:బండిఆత్మకూరు మండలంలోని పార్నపల్లె, యర్రగుంట్ల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గురువారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఏపీఎస్పీడీఎస్ డైరెక్టర్ శశికళారెడ్డి, ఎంపీపీ సంజీవరెడ్డి, సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమసింహనాయక్, యర్రగుంట్ల సర్పంచ్ కల్లూరి శ్వేతకుమారి, లాయర్ సుబ్బరాయుడు,ఎంపీటీసీ మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రోళ్లపెంట ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు: వరదరాజస్వామి ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో నిండం, గురువారం ఉదయం నుంచి ప్రవాహం మరింత అధికం కావడంతో అధికారులు ప్రాజెక్టు గేటును ఎత్తి 400 క్యూసెక్కుల నీటిని పంటకాల్వలకు, చెరువులకు వదిలారు. గురువారం డీఎస్పీ ప్రాజెక్టును సందర్శించారు. కొత్తపల్లి, ఆత్మకూరు మండల పరిధిలోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు హెచ్చరించారు. అలాగే చెరువుల వెంట, పంట కాల్వల వెంట గొర్రెలు, మేకలు, పశువులను మేతకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు నీటి ప్రవాహం వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే నల్లమల అటవీ పరిధిలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిలో ఉన్న బైర్లూటి, రోళ్లపెంటలో ఇటీవల భారీ వర్షాలకు కొండి చరియలు విరిగి పడిన ప్రాంతాన్ని డీఎస్పీ శ్రీనివాసరావు గురువారం సాయంత్రం పరిశీలించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్ఐ కృష్ణమూర్తి, మైనర్ ఇరిగేషన్ ఏఈ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజల వద్దకే పథకాలు



తలముడిపిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

మిడుతూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామని ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ తెలిపారు. బుధవారం తలముడిపి, దేవనూరు గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి , తహసిల్దార్ ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, హరిత, ఎంపీటీసీ ఫరీదా, కో–ఆప్షెడ్ మెంబర్ మౌలా, ఉపసర్పంచ్ అక్బర్, ఎస్ఆర్‌బీసీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్ధారెడ్డి, ఏడీఏ విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామంలో తహసీల్దార్ రత్నరాధిక, వాడాల గ్రామంలో ఎంపీడీఓ గోపీకృష్ణ జగనన్న సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. యర్రగూడూరులో 162, వాడాలలో 234 సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. కార్యక్రమాల్లో వాడాల సర్పంచు లలితమ్మ, ఎంపీటీసీలు సరస్వతమ్మ, మంగమ్మబాయి, ఉపసర్పంచు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాపరెడ్డి, బాలీశ్వరరెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామంలో సర్పంచ్ బాలమద్దిలేటి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ దొడ్డానాగమణి, ఉపసర్పంచ్ చెన్నారెడ్డి, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామంలోని సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి రఘురామ్ లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, సర్పంచు జమిలాబీ, ఎంపీటీసీ మూబీన బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే సురక్ష

శ్రీశైలంటెంపుల్: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న–సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎం ఏ.రజాక్ తెలిపారు. గురువారం శ్రీశైల మండల సచివాలయం–4 పరిధిలో స్థానిక రెడ్ల సత్రంలో జగనన్న–సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ బి.రాజేంద్రసింగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

వేంపెంట చెంచుకాలనీలో అధికారుల పర్యటన

పాములపాడు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేంపెంట చెంచుగూడెంలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరాయి. గురువారం పాములపాడు తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపికృష్ణ, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు చెంచు గూడేన్ని సందర్శించారు. వర్షపు నీటిని బయటకు జేసీబీ ద్వారా పంపించే చర్యలు చేపట్టారు. గిరిజనులకు ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేసి భోజనాలను పంపిణీ చేశారు. కుటుంబాలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు.

ఏపీ జెన్‌కో ఉద్యోగుల నిరసన

శ్రీశైలంప్రాజెక్ట్: ఏపీజెన్‌కో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మధ్యాహ్నం చీఫ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి, సమాన వేతనం , డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని కోరారు. ఏక సభ్య కమిషన్‌ను రద్దు చేసి 2022 పీఆర్‌సీని అమలు చేయాలని పెండింగ్ లో డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొత్తపల్లి: విద్యుత్ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యల సాధనకు గురువారం ఉద్యోగులు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

మహానందిలో అత్యధిక వర్షపాతం



బండిఆత్మకూరు మండలంలో ఈర్నపాడులో రోడ్డుపై చేపలు

మహానంది: మండలంలో గురువారం నమోదైన 96.8 మి.మీ వర్షపాతం జిల్లాలోనే అత్యధికంగా ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రెండో స్థానంలో నంద్యాల మండలం 87.6 మి.మీ, బండిఆత్మకూరు మండలంలో 69.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. జిల్లాలో అత్యల్పంగా ఉయ్యాలవాడలో 14.2 మి.మీ వర్షం కురిసిందన్నారు.

రోడ్డుపై చేపలు...

బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో కురిసిన భారీ వర్షాలు, నల్లమలలోని నీరు కలిసి రోడ్డెక్కి ప్రవహించడంతో కాలనీ దారుల్లో క్యాట్ ఫిష్‌లు (చేపలు)కొట్టుకొచ్చాయి. మహానంది–గాజులపల్లె మార్గంలోని వ్యవసాయ కళాశాల సమీపంలో ఉన్న పాలేరువాగు వంతెన మీదుగా ప్రవహించింది. ఏ.కోడూరు గ్రామం వద్ద వంతెన దాటి నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

జూపాడుబంగ్లాలో48.4మిల్లీమీటర్ల వర్షపాతం

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన వర్షం 48.4మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. వారం రోజుల నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలధాటికి పంటపొలాల్లో వర్షం నీరు నిలిచిపోగా ఇసుక వాగు, కాకిలేరు వాగు, నుద్దవాగు ఓ మాదిరిగా ప్రవహించాయి. వర్షాలు తగ్గుముఖం పడ్తే బాగుంటుందని రైతులు పేర్కొంటున్నారు.

పగిడ్యాల: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి లోతట్టు పొలాలు జలమయ్యాయి. మండలంలో వర్షపాతం 27.6 మిల్లీమీటర్లు నమోదైంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం పొడిగా ఉన్నందున రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం తగ్గుముఖం పడితే సాగైన పొలాల్లో భూమి మందులు వేసుకోవడానికి అనువుగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

పాములపాడులో 40.6మిల్లీ మీటర్ల వర్షం

పాములపాడు: మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు కురిసిన వర్షం 40.6మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. దీంతో పొలాల్లో సాగులో ఉన్న పలు పైర్లు నీటిలో మునిగాయి.